క్లుప్తంగా

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు



బొద్దువానిపాలెం ఎస్సీ కాలనీ వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి

మేదరమెట్ల: అద్దంకి వైపు నుంచి మేదరమెట్ల వైపునకు వస్తున్న మోటారు బైకు కొరిశపాడు మండలంలోని బొద్దువానిపాలెం ఎస్సీ కాలనీ సమీపంలోకి శనివారం రాగానే రోడ్డు దాటుతున్న ఓవ్యక్తిని ఢీకొంది. దీంతో అతనికి గాయాలు కాగా హైవే అంబులెన్స్ సిబ్బంది వైద్యశాలకు తరలించారు.

చీరాలలో స్త్రీశక్తి ర్యాలీ

చీరాల అర్బన్: స్త్రీ శక్తి పథకం విజయోత్సవ ర్యాలీని శనివారం చీరాలలో నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి గడియార స్తంభం సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీలో టీడీపీ చీరాల అధికార ప్రతినిధి ఎం.మహేంద్రనాథ్, మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, మహిళలు పాల్గొన్నారు. సూపర్ సిక్స్ హామీలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు.

విద్యార్థి అభ్యున్నతే లక్ష్యం



స్కూల్ కాంప్లెక్స్‌లో మాట్లాడుతున్న చైర్మన్ బాలప్రసాద్

కారంచేడు: విద్యార్థి సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని కుంకలమర్రు ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ చైర్మన్ బాలప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని కుంకలమర్రు స్కూల్ కాంప్లెక్స్‌లో మాట్లాడారు. మండలంలోని 18 పాఠశాలల నుంచి వచ్చిన ఉపాధ్యాయుల ఈ సమావేశంలో మాట్లాడారు. పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్‌ను పెంపొందించాలన్నారు. విద్యార్థి కేంద్రంగా అనేక సంస్కరణలను ప్రభుత్వం ప్రవేశపెడుతోందన్నారు.

పెంచిన వేతనాలు అందించాలి



అధికారులకు వినతి పత్రం అందిస్తున్న కార్మికులు

జె.పంగులూరు: పారిశుద్ధ్య, కార్మికులకు పెంచిన వేతనాలు వెంటనే అందించాలని కార్మిక నాయకులు మల్లారెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో సుపరింటెండెంట్ రమేష్‌కు శనివారం పంగులూరు పారిశుద్ధ్య కార్మికులు, వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నెంబర్ 75 ప్రకారం రూ. 4 వేలు కలిపి జీతం అందించాలని తెలిపారు. గతంలో ఉన్న పెండింగ్ జీతాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు మల్లారెడ్డి, రామారావు, రాయిణి వినోద్‌బాబు, మండల పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

హెచ్ఐవీని పారదోలదాం

అద్దంకి: అవగాహనతో హెచ్ఐవీని పారదోలదామని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర అన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌ను నియంత్రించడానికి కృషి చేయాలని చెప్పారు. శనివారం హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన సమావేశం నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బలరామిరెడ్డి, టి. దుర్గా భవాని, టి. లక్ష్మి తేజస్విని పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా కాలేజీకి వాటర్ కూలర్ వితరణ



కాలేజీకి వాటర్ కూలర్‌ను అందిస్తున్న దృశ్యం

చీరాల అర్బన్: పట్టణంలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ రిటైర్డు లెక్చరర్ ఫణిదెపు శివాంజనేయప్రసాద్ తాను పనిచేసిన కాలేజీకి వాటర్ కూలర్ శనివారం అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.మురళి మాట్లాడుతూ పనిచేసిన కాలేజీకి తన వంతుగా వాటర్ కూలర్‌ను అందించిన ఫణిదెపు శివాంజనేయప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

8 మందికి జరిమానా

అద్దంకి రూరల్: మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వ్యక్తులను, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 8 మంది పై అద్దంకి సీఐ సుబ్బరాజు కేసు నమోదు చేసి శనివారం అద్దంకి కోర్టుకు హాజరుపరిచారు. న్యాయమూర్తి బి. అఖిల మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 4 గురికి రూ. 19 వేలు, ఓపెన్ డ్రింకింగ్ చేసిన 4 గురికి రూ. 9 వేలు జరిమాన విధించనట్లు సీఐ తెలిపారు.



వాడరేవులో గణేషుడి నిమజ్జనం చేస్తున్న భక్తులు



జాగర్లమూడిలో నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

వినాయకా.. సెలవిక!

యద్దనపూడి: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనాలు శనివారం కోలాహలంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ఎక్కించి గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. మండలంలోని జాగర్లమూడిలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని కోలాహలంగా నిమజ్జనానికి తరలించారు. యువత అంతా గులాములు చల్లుకుంటూ ఆటపాటలతో సందడి చేస్తూ ముందుకు సాగారు. స్వామివారు ఇంటి ముందుకు రాగానే నీటి బిందెలతో వారు పోసి కాయ కర్పూరం సమర్పించారు. మాజీ వైఎస్సార్ సీపీ బాపట్ల పార్లమెంటరీ జిల్లా కార్యదర్శి తమ్మా అమ్మిరెడ్డి, నక్కా పోతిరెడ్డి, ఆళ్ల శివారెడ్డి, మున్నంగి వంశీధర్‌రెడ్డి, గాదె సీతారామిరెడ్డి, దేవగిరి కోటిరెడ్డి పాల్గొన్నారు.

చీరాల టౌన్: గణపతి బప్పా మోరియా అంటూ భక్తులు గణనాథులను గంగ ఒడికి చేరుస్తున్నారు. వినాయకచవితి పండుగను పురస్కరించుకుని చలువ పందిళ్లల్లో ఏర్పాటు చేసిన ప్రతిమలను నిమజ్జనాలకు శనివారం వాడరేవుకు తరలించారు. చీరాల, పర్చూరు, అద్దంకి, చిలకలూరిపేట, నర్సరావుపేట, సత్తెనపల్లి తదితర నియోజకవర్గాల్లోని గ్రామాలు, పట్టణాలల్లో ఏర్పాటు చేసిన పందిళ్లలోని గణనాథులను ఊరేగింపుల అనంతరం నిమజ్జనం కోసం వాడరేవు సముద్ర తీరానికి తీసుకువచ్చి గంగ ఒడికి చేర్చారు. రూరల్ ఎస్సై అంబటి చంద్రశేఖర్, సివిల్, మెరైన్, ఏఆర్ పోలీసులు, గజ ఈతగాళ్లతో బందోబస్తు నిర్వహిస్తూ ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడుతున్నారు.

మండల స్థాయి అధ్యక్షుల నియామకం

జె.పంగులూరు: పార్టీ బలోపేతానికి పనిచేసే వారికి వివిధ కేటగిరీలో మండల స్థాయి కమిటీ అధ్యక్షుల వివరాలు పార్టీ కార్యాలయం నుంచి వచ్చినట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రావూరి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యూత్‌వింగ్ అధ్యక్షునిగా ఎల్‌వీ కృష్ణారెడ్డి, మహిళా విభాగం తేళ్ళ నాగమ్మ, రైతు విభాగం అడ్డగడ వెంకయ్య, బీసీ సెల్ మూరబోయిన ఆంజనేయులు, ఎస్సీ సెల్ మట్టకోయ బాబు (మహేష్), ఎస్టీ సెల్ మొగిలి అంకమ్మరావు, మైనార్టీ సెల్ షేక్ సమ్మద్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ విపర్ల అజయ్ కుమార్, స్టూడెంట్ వింగ్ పాలపర్తి రాజేష్, పంచాయతీ రాజ్ వింగ్ కేతినేని విజయ్‌కుమార్, మున్సిపల్ వింగ్ గంధం నరసింహారావు, ఆర్‌టీఐ వింగ్ చక్రవరం రామాంజనేయులు, వలంటీర్స్ వింగ్ మానం మధుబాబు, గ్రీవెన్స్ సెల్ నల్లమల్ల అజిత్‌కుమార్, వాణిజ్య విభాగం భవనం అంజిరెడ్డి, వేవర్స్ వింగ్ వీరబ్రహ్మం, వైఎస్సార్ టీయూసీ తానికొండ వెంకటగాన ప్రకాష్, అంగన్‌వాడీ వింగ్ బొల్లా నాగమని, రౌతు శ్రీనివాసరావు, కల్చరల్ వింగ్ గుంటుపల్లి రాజశేఖర్, సోషల్ మీడియా వింగ్ పులకండం రాజవర్ధన్ రెడ్డి, ఐటీ వింగ్ పులకం ఈశ్వరరెడ్డి, దివ్యాంగుల విభాగం ముల్లూరి వెంకటేశ్వర్లు, డాక్టర్ వింగ్స్ షేక్ బాబుజ్జీ, ఇంటలెక్చువల్స్ ఫోరం తెలగతోటి జాన్ వేస్లి, బూత్ కమిటీ వింగ్స్ నాయుడు వేణుబాబు, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షునిగా మద్దిరాల నరేష్‌కు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. ఈ కమిటీలు ఏర్పాటు అవడం వలన గ్రామ స్థాయి పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేస్తారన్నారు.

నీటి తీరువా వసూళ్లు వేగవంతం చేయండి

చీరాల టౌన్: గ్రామాల్లో ఉన్న పంట పొలాలకు సంబంధించి నీటి తీరువా వసూళ్లను నెలాఖరు కల్లా పూర్తి చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను నిర్దిత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ సూచించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ రెవెన్యూ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాలు, సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలపై సమావేశాన్ని నిర్వహించారు. 15 గ్రామ పంచాయతీల్లోన్న వ్యవసాయ భూములకు సంబంధించి నీటి తీరువా వసూళ్ల లక్ష్యంగా గ్రామ రెవెన్యూ అధికారులు పనులు చేయాలన్నారు. రైతుల నుంచి వి. ధిగా నీటి తీరువాను వీఆర్వోలు సక్రమంగా వసూళ్లు చేసి నగదును బ్యాంకులో జమ చేయాలన్నారు. అలానే ప్రజలకు సత్వరంగా ప్రభుత్వ సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని కోరారు. రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. గ్రామాల్లో, సచివాలయాల్లో పనిచేసే వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు అర్జీలను త్వరగా విచారించాలన్నారు. అక్రమంగా ఇసుకను తరలించే వారి వాహనాలు సీజ్ చేయాలన్నారు. వీఆర్వోలు ప్రజలకు జవాబుదారీతనంగా రెవెన్యూ ఉద్యోగులు పనిచేయాలన్నారు. విధుల్లో అలసత్వం వహించిన వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సుశీల, మండల సర్వేయర్ బసవాచారి, వీఆర్వోలున్నారు.

‘తోక లేని పిట్ట’ ఎగురుతుంది ఇట్లా!



ఈఎంఎస్ స్పీడ్ పోస్టు

- రేపటి నుంచి నుంచి అద్దంకిలో రిజిస్టర్ పోస్టులు బంద్
- స్పీడు పోస్టులో విలీనం
- మూసుకుపోనున్న పోస్టల్ టపా బాక్సులు
- ఇక ట్రాకింగ్ సిస్టంతో విస్తృత సేవలు
- అద్దంకి డివిజన్ పరిధిలో 7 సబ్ పోస్టాఫీసులు

అద్దంకి: వేలాది మంది జనాభాతో ఉండే అద్దంకి పట్టణంలో పోస్టల్ శాఖ విస్తృత సేవలందిస్తోంది. ముఖ్యంగా వ్యాపారులు..ఉద్యోగులు ఇప్పటి వరకు రిజిస్టర్ పోస్టు సేవలు అందుకున్నారు. అయితే మారిన తరానిక అనుకూలంగా పోస్టల్ శాఖ ఈ పద్ధతిని స్పీడ్‌పోస్టులో విలీనం చేయడంతో సమయం ఆదా అయినట్లయింది. ఇలా వందల సంవత్సరాల నుంచి పోస్టల్ శాఖలో సేవలందిస్తున్న రిజిష్టర్ పోస్టు రద్దు కానుంది. కొత్త విధానం సెప్టంబరు ఒకటో తేదీ నుంచి దేశ వ్యాప్తంగా అమలు కానుంది. ఒకటి నుంచి స్పీడ్ పోస్టు.. పార్శిల్ సేవలు అందించనున్నారు.

కొన్నేళ్ల నుంచి సమర్థవంతంగా..

గత కొన్నేళ్ల నుంచి పోస్టల్ శాఖ ద్వారా స్పీడ్ పోస్టును సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. దాంతోపాటు కొత్తగా ట్రాకింగ్ సిస్టమ్‌ను అమల్లోకి తెచ్చారు. పార్శల్ బుక్ చేసిన వ్యక్తికే కాకుండా దానిని అందుకోనున్న వ్యక్తి మొబైల్ ఫోన్‌కు పూర్తి సమాచారంతో కూడిన మెసేజ్ వస్తుంది. దాంతో బుక్ చేసిన పర్శిల్ ఎక్కడ ఉంది. ఎప్పటికి అందుంతుందనే వివరాలు తెలిసిపోనున్నాయి. పోస్టల్ శాఖలో ఇప్పటి వరకు అమలు అవుతున్న విధానాలకు స్వస్తి పలికి, సరికొత్త సాంకేతికత వైపుగా పయనిస్తోంది. అధునికతతో కూడిన ఏపీటీ 2.0 ద్వారా సేవలందిస్తూ ప్రైవేటు పార్శిల్ సర్వీసుకన్నా మెరుగ్గా పనిచేయనుంది. జూలై నెలకు ముందు పోస్టల్‌శాఖకు చెందిన మొత్తం సేవలు కోర్ ఇంటిగ్రేడెడ్ సిస్టమ్, కోర్ బ్యాంకింగ్ సిస్టమ్ ద్వారా అందేవి. వాటిస్థానంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో ఉన్న 2.0 ఏపీటీ టెక్నాలజీ అమల్లోకి తెచ్చారు. అద్దంకి పోస్టల్ డివిజన్ సూపరెంటెండెంట్ ఐపీవో అశోక్ డివిజన్‌లో పోస్టల్ సేవలను ఏపీటీ 2.0 ద్వారా సేవలు అందిస్తున్నారు. సెప్టంబరు ఒకటో తేదీ నుంచి విలీనమైన స్పీడ్‌పోస్టు ద్వారా సంకేతికత సౌకర్యాలతో సేవలందించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు పోస్టల్ శాఖ అధికారులు చెబుతున్నారు. అద్దంకి డివిజన్ పరిధిలో 7 సబ్ పోస్టాఫీసులు, 88 బ్రాంచ్ పోస్టాఫీసులున్నాయి. వీటిలో స్పీడ్‌పోస్టు ద్వారా ఆధునికి సాంకేతిక సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే ఆయా పోస్టల్ కార్యాలయాల ద్వారా జూలై నుంచి ఏపీటీ 2.0 ద్వారా పోస్టల్ సేవలు అందుతున్నాయి.

పొదుపు రుణాలు సకాలంలో చెల్లించండి

చీరాల టౌన్: బ్యాంకు లింకేజీ రుణాలు తీసుకున్న పొదుపు గ్రూపులు రుణాల చెల్లింపులు సకాలంలో చెల్లించేలా వీఓఏలు చర్యలు తీసుకోవాలని ఏపీఎం మధుసూదనరావు సూచించారు. శనివారం బుర్లవారిపాలెంలోని వెలుగు కార్యాలయంలో మండలంలోని వీఓఏలకు సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ మండలంలో ఉన్న పొదుపు గ్రూపుల వద్దకు వీఓఏలు నెలకు ఒకసారి సమావేశాన్ని నిర్వహించి గ్రూపుల ప్రగతిని తెలుసుకోవాలన్నారు. పొదుపు గ్రూపులు తీసుకున్న రుణాలు, ఏర్పాటు చేసుకున్న స్వయం సహాయక సంస్థలు, వ్యాపారాలను వీఓఏలు పరిశీలించి పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ సంఘాల పుస్తకాలను విధిగా రాయడంతో పాటు సీఐఎఫ్, స్త్రీనిధి, సబ్‌ప్లాన్ రుణాలన్నీ వంద శాతం సక్రమంగా చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రుణం వాయిదాలు పూర్తి అయిన గ్రూపులకు అదనపు మొత్తంతో రుణం అందించాలన్నారు. వీఓఏలు పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి

చీరాల రూరల్: అధ్యాపకులు చెప్పే పాఠ్యాంశాలను విద్యార్థులు క్రమశిక్షణతో అభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కాలేజీలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు చక్కగా ఆహ్వానించారు. కాలేజీ కరస్పాండెంట్ శీలం విద్యాసాగర్‌రావు, ప్రిన్సిపాల్ గారపాటి పుష్పరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. జూనియర్, సీనియర్ విద్యార్థులనే తేడాలు లేకుండా అందరూ అన్నదమ్ముల్లా కలిసిమెలిసి చదువుకోవాలని సూచించారు. విద్య అనేది కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాదని, వ్యక్తిత్వ వికాసం, మానసిక పరిపక్వత అనే అంశాలకు ముడిపడి ఉందని చెప్పారు. విద్యార్థులు చదువులోనే కాక సామాజిక సేవా కార్యక్రమాలతో కూడా ముందుండాలని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు, పాటలు, నాటికలు ప్రదర్శించి సందడి చేశారు. కార్యక్రమంలో కాలేజీ అధ్యాపక సిబ్బంది షిపోరా, మంజుల, సుమ, చినపాప, షీలా, గాస్పర్ పాల్గొన్నారు.

కారంచేడులో నేత్రదానం



యార్లగడ్డ సుబ్బారావు (ఫైల్)

కారంచేడు: తాను చనిపోయిన తరువాత మరొకరికి చూపు ఇవ్వాలనే తన ఆలోచనలకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. మండల కేంద్రమైన కారంచేడు గ్రామానికి చెందిన యార్లగడ్డ బుల్లెయ్య సుబ్బారావు శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. తండ్రి కోరిక ప్రకారం కుమారుడు వెంకటేశ్వర్లు, కుమార్తె అనంతలక్ష్మి.. నేత్రాలను దానం చేయడానికి వీలుగా గ్రామంలోని బ్లడ్ అండ్ ఐ డోనర్స్ అసోసియేషన్ సభ్యులైన యార్లగడ్డ వెంకన్న, దగ్గుబాటి ఆంజనేయులుకి సమాచారం అందించారు. వారు గుంటూరు పెదకాకాని శంకర్ నేత్రాలయానికి తెలపడంతో అక్కడ నుంచి డాక్టర్ శారద, హర్షిత, శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది కారంచేడు వచ్చి శనివారం వేకువజామున నేత్రాలను సేకరించారు. గ్రామంలో ఇది 36వ నేత్రదానంగా కమిటీ సభ్యులు తెలిపారు.

పార్టీ అభివృద్ధి కోసం కృషి చేద్దాం



ఇంకొల్లు మండల పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న గాదె మధుసూదన రెడ్డి

ఇంకొల్లు(చినగంజాం): వైఎస్సార్ సీపీ అభివృద్ధి ధ్యేయంగా నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు కలిసి పనిచేయాలని పర్చూరు ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యదర్శి గాదె మధుసూదనరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పావులూరులోని ఆయన నివాసంలో ఇంకొల్లు మండల కార్యకర్తల సమావేశం మండల కన్వీనర్ చిన్ని పూర్ణారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గాదె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ స్థాపించిన దగ్గరు నుంచి గడచిన మూడు దఫాలుగా పర్చూరు నియోజక వర్గంలో పార్టీ జెండాను ఎగురవేసిందే లేదని రాబోయే 2029 ఎన్నికల్లో పార్టీ జెండా రెపరెప లాడేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మండల కమిటీ నాయకులతో వివిధ అంశాలపై చర్చించారు. మండలంలోని వివిధ సమస్యలు, ప్రధానమైన అంశాలను గురించి అడిగి తెలుసుకున్నారు. నియోజక వర్గంలోని అన్ని సామాజిక వర్గాల్లో వైఎస్సార్ సీపీకి బలమైన ఓటు బ్యాంకు ఉందని అయితే నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయ లోపంతో విజయాన్ని అందుకోలేక పోతున్నామన్నారు. నాయకులు, కార్యకర్తల మధ్య నెలకొని ఉన్న వర్గ, వైషమ్యాలు విడనాడి పార్టీ గెలుపే ధ్యేయంగా కృషి చేయాలని కోరారు. నాయకులు, కార్యకర్తల మధ్య ఎటువంటి సమన్వయ లోపం ఉన్నా, సమస్యలున్నా తన దగ్గరకు వచ్చి కూర్చొని పరిష్కరించుకోవాలని కోరారు. కానీ బహిరంగంగా ఆవేశకావేశాలకు లోనై పార్టీని బలహీన పరచవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి బండారు ప్రభాకరరావు, నూతలపాటి బలరాం, కృష్ణారెడ్డి, కుమ్మరి చందు, కంకటరాంబాబు, ఎలీషా, షంషుద్దీన్, లతీఫ్, పేరయ్య, స్వామి, సుబ్బారెడ్డి, మోహనరావు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశంలో అభివృద్ధి పనులకు ఆమోదం

అద్దంకి రూరల్: అద్దంకి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎల్. ఎస్తేరమ్మ అధ్యక్షత శనివారం స్థానిక కౌన్సిల్ హాలు నిర్వహించిన సమావేశం పలు పట్టణాభివృద్ధి అంశాలను కౌన్సిల్ షభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. 9 అంశాలతో కూడిన అజెండాను మున్సిపల్ ఆర్ఐ అర్జున్‌రావు చదివి వినిపించారు. సభ్యులు ఆమోదం తెలిపారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్

9 నిమిషాల్లో ముగిసిన సమావేశం..

అద్దంకి పురపాలక సంఘం సమావేశం అర్ధ గంట ఆలస్యంగా ప్రారంభమై 9 నిమిషాలకే ముగిసింది. సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా 11.22 నిమిషాలకు ప్రారంభమై11.31 నిమిషాలకు ముగిసింది. అజెండాలో ఉన్న 9 అంశాలకు హడావిడిగా 9 నిమిషాల్లో చదివి సభ్యులకు వినిపించటంతో సమావేశం ముగిసింది. కౌన్సిలర్లు రెండు నిషాల్లో మాట్లాడి ముగించారు.

జూట్, కాటన్ బ్యాగులనే వాడండి

అద్దంకి: పర్యావరణ పరరక్షణ కోసం జూట్ కాటన్ బ్యాగులనే వాడాలని డాక్టర్ చదలవాడ ఫణీంద్రబాబు అన్నారు. శనివారం తన కుమార్తె వేడుకలో భాగంగా హాజరైన వారికి జూట్ కాటన్ బ్యాగులను ఉచితంగా పంపిణీ చేశారు. అందరూ జూట్ కాటన్ బ్యాగులనే వాడి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని కోరారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం భాద్రపద మాసం అనూరాధ నక్షత్రం అష్టమి ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు శనివారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

వ్యక్తిపై ఇనుపరాడ్‌తో దాడి

చీరాల అర్బన్: కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తిపై ఇనుప రాడ్‌తో దాడి చేసి గాయపరచిన సంఘటన శనివారం చీరాల తెల్లగాంధీ బొమ్మ సెంటర్‌లో చోటుచేసుకుంది. ఔట్ పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చీరాలకు చెందిన గుంటూరు మాధవరావుకు, ఈపూరుపాలేనికి చెందిన కూర్మాల శ్రీనివాసరావుకు కుటుంబ కలహాలు, కోర్టు వివాదాలున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం ఇరువురు ఘర్షణ పడి పరస్పరం దాడులకు దిగి గాయపర్చుకున్నారు. తీవ్రంగా గాయపడిన కూర్మాల శ్రీనివాసరావు చీరాల ప్రభుత్వ వైద్యశాలలో చేరారు.

పొగాకుకు ప్రత్యామ్నాయం చూసుకోండి



మాట్లాడుతున్న లాంఫాం శాస్త్రవేత్త రాజేష్ చౌదరి

మార్టూరు: ప్రభుత్వం పొగాకు పంటను నిషేధించినందున రైతులు ప్రత్యామ్నాయంగా పత్తి, మొక్కజొన్న, అపరాల వంటి ప్రత్యామ్నాయ పంటల సాగు చేయటం మేలని శాస్త్రవేత్త ఎల్. రాజేష్ చౌదరి అన్నారు. రాజుపాలెంలో ప్రకాశం జిల్లా ఆత్మ వారి సౌజన్యంతో రైతులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. పొగాకు పంట సాగువలన భూసారం లోపించడమే కాక గిట్టుబాటు ధరలు లేనందున పొగాకు సాగు విరమించుకోవాలని తెలిపారు. ఏడీఏ సుదర్శన రాజు మాట్లాడుతూ పొగాకు ప్రత్యామ్నాయంగా వాణిజ్య పంట అయిన పత్తి సాగు రైతుకు ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. పత్తి పంటలో వచ్చు తెగుళ్లు, తెల్ల దోమ, రసం పీల్చే పురుగుల నివారణ కోసం రసాయనిక ఎరువులపై మాత్రమే ఆధార పడకుండా సమగ్ర యాజమాన్య పద్ధతులు అవలంబించడం ద్వారా నష్ట నివారణ చేసుకోవచ్చని తెలిపారు. ఏవో లావణ్య మాట్లాడుతూ ప్రతి పంట చుట్టూ రెండు వరుసల జొన్న, సజ్జ లేదా మొక్కజొన్న పంటలను దడి పంటలుగా సాగు చేయటం వలన పురుగులు తెగుళ్ల బారి నుంచి పంటను రక్షించుకునే అవకాశం ఉందని తెలిపారు. ప్రకృతి సేద్యం ఎంటీఎల్ రాజశేఖర్ రైతులకు రసాయనిక.. కాంప్లెక్స్ ఎరువులకు ప్రత్యామ్నాయంగా పలు రకాల కషాయాలు తయారు చేసుకోవడం గురించి అవగాహన కల్పించారు. ఎంపీఈవోలు గుణశేఖర్, వందనయ్య ఆత్మ ఏటీఎం అక్షరాని స్థానిక రైతులు పాల్గొన్నారు.

పాలకమండలి ఆలయ అభివృద్ధికి కృషి



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు

యద్దనపూడి: నూతనంగా నియమించిన పాలకమండలి సభ్యులు ఆలయ అభివృద్ధికి పారదర్శకంగా కృషి చేయాలని అద్దంకి ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ ఆర్.వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని పూనూరు వీరభద్రస్వామి నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం ఆలయ ఆవరణలో నిర్వహించారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్‌గా రాటకొండ కోటేశ్వరరావు (బుల్లోడు)సభ్యులుగా గుంటుపల్లి హరిబాబు, గన్నమనేని శ్రీదేవి, బోయపాటి అరుణ, కావూరి వెంకాయమ్మ, పాలపర్తి మల్లేశ్వరి, కుంచపు శివపార్వతిలచే ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ ప్రమాణం చేయించారు. ఎక్స్ ఆఫీషియో సభ్యులుగా మూలం రాజు రాజ్‌కుమార్ శర్మ ప్రమాణస్వీకారం చేశారు. ఆలయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి జీవీఎల్ కుమార్, వేణుగోపాలస్వామి ఆలయ అర్చకులు దీవి భావానాచార్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సులువైన పద్ధతిలో బోధన చేపట్టాలి



ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న ఎంఈఓ

పర్చూరు(చినగంజాం): విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో సులువైన బోధన పద్ధతిలో ఉపాధ్యాయుల బోధన ఉండాలని ఎంఈఓలు శివకోటేశ్వరరావు, వెంకట్రావు అన్నారు. శనివారం చెరుకూరులో ఎన్ ఎస్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో సెకండరీ స్కూల్ క్లస్టర్ సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన పద్ధతులు ఉండాలని వాటికి సంబంధించిన పూర్తి సామర్థ్యాలను ఉపాధ్యాయులు కలిగి ఉండాలని వారు సూచించారు. పాఠశాల హెచ్ఎం అనోక్ బెంజిమన్, అడుసుమల్లి హెచ్ఎం నిర్మలకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రోన్ పర్యవేక్షణలో వినాయక నిమజ్జనాలు



డ్రోన్‌తో నిమజ్జన కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్న దృశ్యం

అద్దంకి రూరల్: అద్దంకి పట్టణంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన మండిరాల నుంచి పూజలు అందుకున్న గణనాథులను ఆయా కమిటీల నిర్వాహకులు శనివారం రాత్రి నిమజ్జన కార్యక్రమాలు చేపట్టారు. అద్దంకి సీఐ సుబ్బరాజు ఆధ్వర్యంలో డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించారు. నిమజ్జన కార్యక్రమాల్లో ఎటువంటి అల్లర్లు జరగకుండా, అల్లర్లకు పాల్పడేవారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.